సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 23 । మే । 2025



జై హనుమాన్

హనుమజ్జయంతిని జిల్లా అంతటా గురువారం ఘనంగా జరిపారు. వేకువజాము నుంచే భక్తులు ఆంజనేయుడి విగ్రహాల వద్ద, రామాలయాల్లో స్వామి దర్శనానికి బారులు దీరారు. తమలపాకులను దండలుగా కూర్చి పవనసుతుడికి సమర్పించారు. హనుమాన్ చాలిసా పారాయణతో ఆలయాలు మార్మోగాయి. -సాక్షి నెట్‌వర్క్

బలిఘట్టం ఆలయంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆత్మస్తుతి.. పరనిందలతో సాగిన మినీ మహానాడు బోర్ కొట్టించింది. పేరుకే జిల్లా స్థాయి సమావేశం కానీ నియోజకవర్గానికే పరిమితమయింది. చాలా నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దగా హాజరు కాలేదు. పార్టీలో అసమ్మతి, గ్రూపుల గోల స్పష్టంగా కనిపించింది. జిల్లాలో కొంతమంది సీనియర్ నాయకులు సభను సక్సెస్ చేయడం **కంటే విఫలం చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.**



సమావేశం నుంచి మధ్యలో వెళ్లిపోతున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు



..అయినా బారికేడ్లు దూకి మెల్లగా జారుకుంటున్న కార్యకర్తలు

మహా తుస్సు నాడు

- **పేరుకే జిల్లా స్థాయి.. నియోజకవర్గానికే పరిమితం**
- **వినుగు తెప్పించిన నేతల సెల్ఫ్ డబ్బా ప్రసంగాలు**
- **పాత కాపులకు ప్రాధాన్యం కరువు**
- **మధ్యలోనే వెళ్లిపోయిన కార్యకర్తలు**
- **పథకాల పేరుతో మభ్యపెట్టి వృద్ధులు, ఉపాధి కూలీల తరలింపు**

ఎస్.రాయవరం/నక్కపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు పేలవంగా జరిగింది. గురువారం అడ్డురోడ్డులో జరిగిన ఈ కార్యక్రమం పార్టీలో లోటుపాట్లను బహిర్గతపరచింది. జిల్లాలో మంత్రి పదవులు రాని ఎమ్మెల్యేలు, గుర్తింపులేని పదవులు దక్కించుకున్న సీనియర్ నాయకులు ఈ మహానాడుకు జనాన్ని తరలించేందుకు ఆసక్తి చూపించలేదన్న ప్రచారం జరుగుతోంది. పథకాలు ఇస్తాము, పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మభ్యపెట్టి ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలతో సభాప్రాంగణాన్ని నింపేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హాజరైన జనం సైతం నాయకులు సెల్ఫ్ డబ్బా ప్రసంగాలకు విసుగు చెంది మధ్యలోనే నిష్క్రమించారు. వారిని పోలీసు సిబ్బంది అడ్డుకొని తిరిగి లోపలికి పంపే ప్రయత్నాలు చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశానికి ఎంపీ సీఎం రమేష్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరు కాలేదు.

కష్టపడ్డ వారికి దక్కని ప్రాధాన్యం

పార్టీలో ఆది నుంచి కష్టపడి పనిచేస్తున్న వారికి ఈ సమావేశంలో ప్రాధాన్యం దక్కలేదు. కనీసం సమా**వేశ ప్రాంగణంలోకి కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. ఎస్.రాయవరం మండలం జేపీ పాలెం, సైతారుపేట, సీతారాంపురం, తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులకు వేదిక వద్ద, వేదిక ముందు, సభాప్రాంగణంలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో వారంతా అసంతృప్తితో సభ బయట నుంచి కొద్ది సేపు సమావేశాన్ని తిలకించి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇతర మండలాల నాయకులదీ** అదే పరిస్థితి. భజన చేసే వారికే ప్రాధాన్యం ఇచ్చారని, స్టేజి మీదకు వెళ్లే అవకాశం కల్పించారని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డవారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని నాయకుడొకరు ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యలోనే జారుకున్న జనం

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 2024లో



మధ్యలోనే ఖాళీ అయిన సభా ప్రాంగణం

కాదు, 2029లో గెలవడం ముఖ్యమని అన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో రానున్న పరిశ్రమలతో లక్ష ఉద్యోగాలు కల్పించే అవకాశం వచ్చిందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ప్రసంగం ప్రారంభం కాగానే సమావేశానికి వచ్చిన వారు ఒక్కొక్కరు లేచి వెళ్లిపోయారు. సమావేశానికి వచ్చిన మహిళల్లో కొంతమంది ఈ సోది మనకెందుకులే అంటూ సమావేశానికి దూరంగా పచ్చిక బయళ్లలో ముచ్చట్లు పెట్టుకోవడం కనిపించింది.

సమావేశానికి వచ్చిన మందుబాబులకు పీకల దాకా మద్యం పట్టించడంతో సమావేశాన్ని పక్కనపెట్టి ఫుల్‌గా మందుకొట్టి రోడ్ల మీద తెలివిలేకుండా దొర్లడం కనిపించింది. వచ్చిన వారు మధ్యలో వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఏపీయూఐడీసీ చైర్మన్ పీలా గోవిందు, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ, టీడీపీ ఐటీ విభాగం ఇన్‌చార్జ్ చింతకాయల విజయ్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ టీడీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నుంచే ముసలం!



- ఎమ్మెల్యేగా ఉన్నందుకు సిగ్గుపడుతున్నా..
- చర్చనీయాంశమైన బండారు వ్యాఖ్యలు

నక్కపల్లి: నిధుల కేటాయింపులో ఎందుకీ వివక్ష.. మాడుగులపై చిన్నచూపు చూస్తున్నారు.. మూడేళ్ల పాటు నిధులు ఇవ్వలేమని చెప్పేయండి.. నియోజకవర్గం ప్రజల కాళ్లావేళ్లా పడి అభివృద్ధి గురించి అడగొద్దని ప్రాధేయపడతాను.. అంటూ మినీ మహానాడు వేదికపై సాగిన మాడుగుల ఎమ్మెల్యే, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వ్యాఖ్యలు కలకలం రేపాయి. అడ్డురోడ్డులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగం వాడిగా వేడిగా సాగింది. ఆయన మాటలతో నేతలంతా ఖిన్నులైపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాడుగుల, చోడవరం నియోజకవర్గాలు బాగా వెనుకబడి ఉన్నాయని, పార్టీ విజయానికి దోహదపడిన ఈ రెండు ప్రాంతాలను పట్టించుకోకపోవడం తగదన్నారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో ముగ్గురు జనసేన పార్టీ వారైతే, టీడీపీ నుంచి గెలిచిన వారిలో ఒకరు స్పీకర్‌గా, మరొకరు హోంమంత్రిగా ఉన్నారని, నిధులన్నీ వారే పట్టుకుపోతున్నారని అర్థం వచ్చేలా బండారు ప్రసంగం సాగింది. పదవుల్లేకుండా ఉన్నది తాను, చోడవరం ఎమ్మెల్యే రాజు మాత్రమేనని ప్రస్తావించడంతో.. మంత్రి పదవి దక్కలేదన్న బాధ బండారు మాటల్లో వ్యక్తమయింది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కూడా తన ప్రసంగంలో.. సీనియర్లకు, కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యత లేకపోతే మనుగడ కష్టమన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు.


పెందుర్తి కూటమిలో కల్లోలం

'నేను పెందుర్తి ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేని. నా మీద టీడీపీ ఇన్‌చార్జిని వేసి అతనికి అధికారాలు ఇస్తామంటే ఎలా..? నియోజకవర్గంలో మాకు తెలియకుండా టీడీపీ నేతలు పనులు చేయించుకుంటున్నారు. టీడీపీ ఇన్‌చార్జిలు అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి? ఇదేనా పొత్తు ధర్మం'అంటూ వీఎంఆర్‌డీఏ వేదికగా పెందుర్తి **ఎమ్మెల్యే** పంచకర్ల రమేష్‌బాబు చేసిన వ్యాఖ్యలు.

'నియోజకవర్గంలో టీడీపీ కేడర్ అంతా కలిసి పనిచేస్తేనే జనసేన ఎమ్మెల్యే పంచకర్ల **గెలిచారు. ఒక** రకంగా చెప్పాలంటే పంచకర్ల గెలుపు టీడీపీ పెట్టిన భిక్ష. టీడీపీ ఓట్లతో **గెలిచిన ఎమ్మెల్యే** ఇప్పుడు టీడీపీ కార్యకర్తలను పురుగుల్లా చూస్తున్నారు. అందుకే **టీడీపీ ఇన్‌చార్జి**కి కూడా ఎమ్మెల్యేతో సమానంగా అధికారం ఇవ్వాలి'మినీ మహానాడు **వేదికపై పెందుర్తి** టీడీపీ ముఖ్య నాయకుల తీర్మానం.

'మా నాయకుడు(మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి) పెందుర్తిలో **టీడీపీని నిలబెట్టా**డు. ఇప్పుడు మమ్మల్ని పార్టీ నుంచి దూరం పెడుతున్నారు. వేరే **పార్టీల నుంచి** వచ్చిన వారికి టీడీపీలో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. **ఇలా అయితే** మా ప్రతాపం కూడా చూపిస్తాం'అంటూ.. బండారు వర్గీయులు బాబ్జీ **అనుచరులకు** చాలెంజ్ చేశారు.

- ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ ఇన్‌చార్జి గండి సిగపట్లు
- నేను కూడా ఉన్నానంటున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు
- వీఎంఆర్‌డీఏ వేదికగా తారస్థాయికి చేరుకున్న విభేదాలు
- మినీమహానాడులోనూ బహిర్గతమైన కూటమి కయ్యాలు



పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంపై ఆధిపత్యం కోసం టీడీపీ, జనసేన ముఖ్య నేతలు అధికారిక కార్యక్రమాల్లో బాహాబాహీకి దిగితే.. కేడర్ క్షేత్రస్థాయిలో తన్నుకునేందుకు సిద్ధమవుతున్నారు. అధికార యంత్రాంగాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఓ వైపు జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మరోవైపు టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ తీవ్రస్థాయిలో పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి నేనే సుప్రీం అని పంచకర్ల అంటుంటే.. ఎన్నికల్లో చేసిన మేలుకు ఫలితంగా తనకూ ఎమ్మెల్యేతో సమానంగా గౌరవం ఇవ్వాల్సిందేనని బాబ్జీ భీష్మించుక్కూర్చుంటున్నారు. ఎంతలా అంటే ఏకంగా వీఎంఆర్‌డీఏ సమీక్షలో మున్సిపల్ మంత్రి నారాయణ ముందే తమ అధికారాల కోసం బాహాబాహీకి దిగేంత..!

జుగుప్సాకర చర్యలు

నెల రోజుల క్రితం టీడీపీ నాయకుల పని కోసం గండి బాబ్జీ ఎమ్మెల్యే రమేష్‌బాబుకు ఫోన్ చేస్తే వాళ్ళ కోసం అయితే నువ్ నాకు ఫోన్ చేయొద్దని పంచకర్ల ఘాటుగా సమాధానమిచ్చారట. దీంతో మావాళ్ల పని ఎలా చేయించుకోవాలో నాకు తెలుసు.. అంటూ అదే స్థాయిలో బాబ్జీ విరుచుకుపడినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో కూడా టీడీపీ, జనసేన చోటామోటా నాయకులు ఆధిపత్యం కోసం వీధి రౌడీల కంటే హీనంగా వ్యవహరిస్తున్న దాఖలాలున్నాయి. మరోవైపు టీడీపీలో స్థానికుడైన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, బాబ్జీ వర్గాల మధ్య విభేదాలు రాజుకున్నాయి. పరవాడలో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఏకంగా వీరు కొట్టుకున్నంత పనిచేశారని సమాచారం. అత్యంత జుగుప్సాకరంగా ఫ్యాంట్లు విప్పి మరీ.. పరస్పరం బూతులు తిట్టుకోవడాన్ని పార్టీ నాయకులే అసహ్యించుకుంటున్నారు.

ఆధిపత్య పోరులో అధికారులే సమిధలు

ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ ఇన్‌చార్జి గండి మధ్య ఎన్నికల నుంచి ఆధిపత్య పోరు నడుస్తోంది. అధికారంలోకి ఎలాగైనా రావాలన్న ఆశతో కలిసి పనిచేశారు తప్ప, అధికారంలోకి వచ్చాక ఉప్పూ..నిప్పులానే ఉన్నారు. బాబ్జీ తనకున్న జిల్లా, రాష్ట్రస్థాయి ముఖ్య నేతల పరిచయాలతో సిఫార్సులు చేసి, తన అనుకూల అధికారులను కోరిన చోటుకు బదిలీ చేయించుకున్నారు. అదే సమయంలో పంచకర్ల సిఫార్సులు కొన్ని పనిచేయలేదు. దీంతో పాటు ఇటీవల నియోజకవర్గ అధికారిక కార్యక్రమాల్లో బాబ్జీ చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ కార్యాలయంలోనే ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి, అంతా తానే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఎం సహాయ నిధి చెక్కులు కూడా పంపిణీ చేస్తున్నారు. దీంతో పంచకర్లలో అసహనం మరింత పెరుగుతోంది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సైతం ఇక్కడి వ్యవహారాల్లో తరచూ వేలెడుతున్నారు. వీరి వేధింపులు తట్టుకోలేక కొందరు అధికారులు బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోయారన్న విమర్శలున్నాయి.

సీహెచ్‌వోల వేదన.. అరణ్య రోదన 10లో

వచ్చే నెల 21 వరకు యోగాంధ్ర

- అన్ని గ్రామాల్లో నిర్వహించాలి
- అధికారులతో కలెక్టర్ సమీక్ష



తుమ్మపాల: యోగాంధ్ర–2025 కార్యక్రమాలను గ్రామ, వార్డు, మండలం, జిల్లా కేంద్రాల్లో వచ్చే నెల 21వ తేదీ వరకు ప్రతి రోజు నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించి దిశానిర్దేశం చేశారు. జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర 2025'పై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 27న పరవాడ మండలం ముత్యాలంపాలెంలోను, జూన్ 2న గొలుగొండ మండలం కేడీ పేటలోని ఏఎస్ఆర్ పార్క్ వద్ద, 9న రాంబిల్లి మండలం ధనదిబ్బలో, 15న ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం బీచ్ వద్ద జరిగే యోగాంధ్ర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 10న దేవరాపల్లి మండలం రైవాడ రిజర్వాయర్ వద్ద 1000 మంది ఉపాధి హామీ కూలీలతోను, జూన్ 18న మాడుగుల నియోజకవర్గం చొడువాడలోను యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఎస్‌ఏవోబీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి కె.లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

26న చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా టీకాలు

అనకాపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి మీజిల్స్, రుబెల్లా టీకాలు వేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రాథమిక, పట్టణ ప్రాథమిక, విలేజ్ హెల్త్ సెంటర్లలో టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మొదటి దఫా ఈనెల 26 నుంచి 31 వరకూ, రెండో దఫా జూన్ 23 నుంచి 28 వరకూ, మూడో దఫా జూలై 21 నుంచి 26వ తేదీ వరకూ వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మీజిల్స్, రెబెల్లా వ్యాధి సోకినా చిన్నారులకు జ్వరంతో కూడిన నిమోనియా వ్యాధి సోకడంతో ఒంటిపై దద్దుర్లు వచ్చే ప్రమాదం ఉందని, ఈ వ్యాధి సోకిన పిల్లలలో శారీరక ఎదుగుదల తగ్గుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మీజిల్స్, రుబెల్లా ఈ మధ్య కాలంలో పిల్లలకు సోకిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాక్సిన్లు 5 సంవత్సరాల లోపు పిల్లలకు వేయడం జరుగుతుందన్నారు.

తల్లి చెంతకు బాలిక

పోలీసుల కృషితో సుఖాంతం

నర్సీపట్నం: నర్సీపట్నం ఎస్సీ బాలికల వసతిగృహం నుంచి అదృశ్యమైన బాలికను పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు అందించిన వివరాలు.. బాలిక (13) పాల్‌ఘాట్ సెంటర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహంలో ఉంటూ సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ (తురకబడి)లో ఎనిమిదో తరగతి చదివేది. స్కూల్‌కు వెళ్లే క్రమంలో విద్యార్థిని గత నెల 8వ తేదీన కనిపించకపోవడంతో తల్లి మహేశ్వరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రెయినీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు కలిసి టీమ్స్ ఏర్పాటు చేశారు. వారు తీవ్రంగా గాలించినా తొలుత ఆచూకీ లభించలేదు. మూడు రోజుల క్రితం బాలిక వివరాలు హెల్త్ అండ్ మెడికల్ గ్రూప్స్‌కు మళ్లీ పంపించారు. రాజమండ్రి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారు సదరు బాలిక సమాచారాన్ని ట్రెయినీ డీఎస్పీకి అందించడంతో తమ సిబ్బంది రాజమండ్రి వెళ్లి బాలికను తీసుకొని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారని డీఎస్పీ తెలిపారు. అల్లరి ఎక్కువగా చేస్తుందని తల్లిదండ్రులు మందలించడంతో వెళ్లిపోయానని విద్యార్థిని తెలిపిందని పేర్కొన్నారు. తను ఉంటున్న హాస్టల్ నుంచి తప్పించుకొని బస్సులో అనకాపల్లి వెళ్లి, అక్కడ రైలు ఎక్కి రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో దిగి భయంతో తిరుగుతుండగా, రైల్వే పోలీసులు గమనించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్టు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలు తనిఖీ చేసిన డీఈవో

రావికమతం : మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా డీఈవో జి.అప్పారావు నాయుడు గురువారం తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తరగతి గదులను, పరీక్ష కేంద్రం వద్ద వసతులను పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరిగే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ ఏడాది విద్యార్థులకు అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. కిట్లు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాజీ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజశేఖర్

విశాఖ–లీగల్ : వేసవి సెలవుల దృష్ట్యా పలువురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సెలవుల్లో ఉండడంతో, ఆయా కోర్టులకు సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజశేఖర్ 15 రోజులపాటు విశాఖపట్నంలోని కొన్ని కోర్టులతో పాటు యలమంచిలిలోని కోర్టులకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.



బత్తిన రాజశేఖర్

ఇంటింటికీ రేషన్‌కు గోవిందా..! ఇకపై మన ఇంటి ముందుకే వచ్చి రేషన్ ఇచ్చే వాహనం ఎక్కడా కనపడదు. పాత పద్ధతిలోనే చౌక దుకాణాల నుంచి రేషన్ బియ్యం భుజాన వేసుకుని కిలోమీటర్ల మేర మోసుకుంటూ తెచ్చుకోవాల్సిన పరిస్థితులే వస్తున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరాను కూటమి ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నుంచి నిలిపివేసింది. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు భారాలు, కష్టాలు మొదలయ్యాయి. కూటమి పార్టీలకు ఓటేసిన పాపానికి మళ్లీ పాత కష్టాలు స్వయంగా తెచ్చుకున్నట్టు ఉందని ప్రజలు బాధపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఇంటి వద్దకే వచ్చి సరకులు పంపిణీ చేస్తున్న రేషన్ బండి





రేషన్ డిపో వద్ద సరకుల కోసం బారులు దీరిన జనం (ఫైల్)

- జనంపై ఇదేం కక్ష 'బాబూ'

రేషన్ బండికి బ్రేకులు

ఇంటింటికీ రేషన్ ఆపేసిన కూటమి ప్రభుత్వం

- ఇక చౌకదుకాణాల నుంచి సరకులు తెచ్చుకోవాల్సిందే
- మారుమూల గ్రామాల్లోని కార్డుదారులకు మళ్లీ కష్టాలు
- వాహన నిర్వాహకులకు దూరమైన ఉపాధి
- 1 నుంచి రేషన్ దుకాణాల నుంచే నిత్యావసరాలు పంపిణీ

సాక్షి, అనకాపల్లి : ఒకవైపు అన్నింటిపైనా భారం మోపుతూ.. మరోవైపు ఉన్న సౌకర్యాలను ప్రభుత్వం దూరం చేస్తోంది. తాజాగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) వాహనాలను రద్దు చేసింది. నిత్యావసరాల కోసం ప్రజలు దూరాభారం ప్రయాణించి ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యానికి, ఎంతో మంచి ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటికే రేషన్ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే నెలవారి ఇచ్చే రేషన్‌లో ఒక్కో సరకును తగ్గించుకుంటూ వస్తూనే మరోవైపు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ పథకానికి మంగళం పాడుతున్నారు.


జిల్లాలో రేషన్‌దారుల వివరాలు

జిల్లాలో తెల్లకార్డుదారులు	5,41,818
చౌక ధరల డిపోలు	1069
ఎండీయూ డీలర్లు	374
అందులో పనిచేసే కళాసీలు	374

నిరుద్యోగ యువతకు ఉపాధి.. : 72 నెలలకు గానూ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి అగ్రిమెంట్ చేసుకున్నారు. 53 నెలలే పూర్తయింది. మరో 19 నెలల కాల పరిమితి ఉండగానే రద్దు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021 జనవరిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి నుంచి ఇంటి ముందుకే వ్యాన్ల ద్వారా సరకులు అందజేయడం ప్రారంభించింది. వీటి కోసం నిరుద్యోగ యువతకు వాహనాలను బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వాటి ద్వారా నడిపించారు.

రోడ్డున పడ్డ సిబ్బంది.. : ఈ పథకంపై ఆధారపడి జిల్లాలో 374 ఎండీయూ డీలర్లు, అందులో పనిచేసే మరో 374 మంది కళాసీలు బతుకున్నారు. ఇప్పుడు అర్ధంతరంగా ఈ పథకానికి మంగళం పలకడంతో వారంతా రోడ్డున పడ్డారు. ప్రభుత్వ నిర్ణయంపై దశల వారీ ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారు. దీనిపై రాష్ట్ర కమిటీ సమావేశంలో త్వరలో నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తారు

మధ్యలో తొలగించడం అన్యాయం



ప్రభుత్వం ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. 2027 జనవరి వరకూ అగ్రిమెంట్ ఉంది. 53 నెలలు మాత్రమే చేశారు. ఇంకా 19 నెలలు కాల పరిమితి ఉంది. మధ్యలో మమ్మల్ని తొలగించడం సరైన నిర్ణయం కాదు. ఈ వాహనాల నిలిపివేయడం కారణంగా 750 మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అగ్రిమెంట్ ప్రకారం మా వాహనాలను కొనసాగించాలి. ఒక వేళ ఇందులో కాకపోయినా వేరే విభాగంలోనైనా మాకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అప్పటికీ న్యాయం జరగకపోతే న్యాయ స్థానాలను ఆశ్రయిస్తాం.

– జెట్టీ శ్రీను, ఎండీయూ జిల్లా యూనియన్ ప్రెసిడెంట్

ప్రభుత్వ నిర్ణయం బాధాకరం

రేషన్ బళ్ల వల్ల ఇంటి దగ్గరకే వచ్చి బియ్యం అందజేసేవారు. ఇపుడు రేషన్ బళ్లను నిలిపివేస్తామనడం బాధాకరం. మళ్లీ రేషన్ డిపోకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకోవడం జనానికి ఇబ్బందికరం. ప్రభుత్వం రాజకీయ కోణంలో ఆలోచించకుండా ఇంటింటికీ రేషన్ సరఫరా కొనసాగించాలి. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల వారికి తీరని అన్యాయం జరుగుతుంది. విసిరేసినట్టు ఉండే గిరిజన తండాలకు రేషన్ బండి వెళ్లి సరకులు సరఫరా చేసేది. వాటిని రద్దు చేసి, రేషన్ డిపోలకు వెళ్లి తెచ్చుకోవాలంటే మళ్లీ పాత రోజులు వచ్చినట్టే.

– బి.రమాదేవి, అర్జునగిరి, చీడికాడ మండలం

క్లుప్తంగా

సిరసపల్లి ఆలయ భూములు విక్రయిస్తే చర్యలు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి రాజుపాలెం వేంకటేశ్వరస్వామి అలివేలుమంగమ్మ దేవాలయ భూములపై ఎటువంటి లావాదేవీలు నిర్వహించకూడదని జిల్లా దేవ దాయ శాఖ అధికారి కె.ఎల్.సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూము లు ఆక్రమణలపై అన్ని ఆధారాలతో జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి జి.వేంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేర కు ఆలయ భూము ల్లో ఎటువంటి క్రయవిక్రయాలు నిర్వహించరాదని జిల్లా రిజిస్ట్రర్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఈ భూములు గతంలో 22ఏలో ఉన్నాయని, కొంత మంది వ్యక్తులు వేరే సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తుందన్నారు. అటువంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దేరులో పెరుగుతున్న నీటిమట్టం

మాడుగుల రూరల్: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జాలంపల్లి వద్ద పెద్దేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, గురువారం నాటికి 135 మీటర్లకు చేరుకుంది. జలాశయం పరిసర ప్రాంతంలో 12 మిల్లీమీటర్లు వర్షాపాతం నమోదైంది. జలాశయం పరిసరాల్లో కురిసిన వర్షాలకు 17 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరిందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

- ప్రజా వ్యతిరేక పాలనపై వైఎస్సార్‌సీపీ పోరాటాలు
- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి
- సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

ఏడాది పాలనలో సూపర్ సిక్స్ గోవిందా..



శోభా హైమావతి, మాజీ ఎంపీ సత్యవతి, భరత్‌కుమార్‌లను సత్కరిస్తున్న కార్యకర్తలు



పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి విమర్శించారు. ప్రజలు పక్షాన పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్, జూలై మాసాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీలు, డిసెంబర్‌లో బూత్ కమిటీలు పూర్తి చేసి, 18 లక్షల మందితో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి నాయకుడిగా ఎదగాలంటే ప్రతిపక్షంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. గత పాలనలో వలంటీర్లను, సచివాలయం ఉద్యోగులను గుర్తించడం వల్ల నేరుగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వల్ల పార్టీ కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడాలంటే భయపడుతున్నారని వాపోయారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం సిగ్గుచేటు

మాజీ ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడం ఒక పార్టీతో సాధ్యం కాదని, టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకి 40 శాతం మద్దతు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఇతర రాష్ట్రాల సీఎంలు మన రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలపై ప్రత్యేకంగా వచ్చి నివేదికలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఏపీ, తెలంగాణలో గతంలో పది మెడికల్ కళాశాలలు ఉంటే, వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.500 కోట్లతో జిల్లాకు ఒక మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపడితే, కూటమి పాలనలో వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలు తీసుకోవడం సిగ్గుచేటన్నారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ మేయర్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు బలంగా నిలబడి పోరాడారని, పార్టీ గుర్తుపై గెలిచి ఇతర పార్టీలో చేరడం అన్యాయమన్నారు. త్వరలో నియోజకవర్గంలో 510 మందికి పార్టీ పదవులు ఇస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు హృదయం లాంటివారని చమత్కరించారు. అంతకుముందు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టరు జి.రామ్మూర్తి సతీమణి సత్యవతిదేవి మృతికి సంతాపంగా పార్టీ శ్రేణులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతిని శాలువాలు, గజమాలలతో సత్కరించారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, అనకాపల్లి, కశింకోట ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగ లక్ష్మిగున్నయ్యానాయుడు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, 80, 83, 84 వార్డుల ఇన్‌చార్జులు జాజుల రమేష్, కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లెల సాయికిరణ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కశింకోట మండలాధ్యక్షుడు మలసాల కిశోర్, వైస్ ఎంపీపీ అయితా రాము, నాయకులు కడిమిశెట్టి సతీష్, బొడ్డేడ లక్ష్మినరసింహ, కొట్యాల పద్మ, కొణతాల మురళీకృష్ణ, నీటిపల్లి లక్ష్మి, కాండ్రేగుల హైమావతి, పీడీ గాంధీ, గైపూర్ రాజు పాల్గొన్నారు.

టీడీపీ వారిని తక్షణమే అరెస్టు చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో దళితుల ర్యాలీ



నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న దళితులు

నక్కపల్లి: మండలంలోని డొంకాడలో ఇటీవల దళితులపై దాడి చేసి హత్యకు యత్నించిన టీడీపీకి చెందిన గ్రామ అగ్రవర్ణ పెత్తందార్లను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నక్కపల్లిలో దళితులు ర్యాలీ చేశారు. అనంతరం అప్పలరాజు, తదితరులు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన టీడీపీకి చెందిన 14 మంది అగ్రవర్ణాల వారు లైట్లు ఆపేసి కర్రలతో దాడి చేసి హత్యకు ప్రయత్నించారన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే 19వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సి ఉండగా, అగ్రవర్ణాలవారికి కొమ్ముకాసే విధంగా స్టేషన్ బెయిల్ ఇచ్చే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. 20వ తేదీన డీఎస్పీ విచారణ చేపట్టి రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నారు. కేసును నీరు గార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంపై ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. తక్షణమే నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేయకపోతే ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు వీది కన్నారావు, నొక్కు శివ, కుంచ రమణ, లోవరాజు, సత్యనారాయణ, బిల్లా, ఉప్పాటి ఆనందరావు, సత్యనారాయణ, దయాసాగర్, పోతురాజు, కిశోర్, సందీప్, మధు విజయ్, రాజు, సీపీఎం మండల కన్వీనర్ ఎం రాజేష్ పాల్గొన్నారు.

గొట్టివాడలో రాజకీయ కక్షతో ఇల్లు కూల్చివేత

కోటవురట్ల: కూటమి పాలనలో రాజకీయ కక్షలు కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పల్లెల్లో సైతం వ్యక్తులను టార్గెట్ చేసుకుని ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. గొట్టివాడలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కట్టుమూరి అప్పారావు భార్య ధనశేషుకుమారికి గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో సర్వే నంబరు 89/2లో ప్లాట్ నంబరు 4 కేటాయించగా ఇల్లు నిర్మించుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటిన్నర సెంట్లలో ఇల్లు నిర్మించాల్సి ఉండగా.. ఆఖరి ప్లాట్ కావడంతో అర సెంటు అదనంగా కలిసి రావడంతో కలిపి భవనాన్ని నిర్మించారు. దీనిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తహసీల్దారు తిరుమలబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు.. లబ్ధిదారు శేషుకుమారికి నోటీసు పంపించారు. గురువారం పోలీసుల బందోబస్తు మధ్య తహసీల్దారు, సిబ్బందితో కలిసి అర సెంటులో అదనంగా ఉన్న భవనం ఎలివేషన్, మెట్లను పొక్లెయిన్‌తో కూలగొట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తమ కుటుంబం వైఎస్సార్ సీపీలో కొనసాగడంతో పాటు వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాలను ప్రశ్నించినందుకు టీడీపీ నాయకులు తమపై కక్ష కట్టారని ఆరోపించారు. లే అవుట్‌లో 42 ఇళ్లు ఉండగా, 15 మంది వరకు పక్కనే ఉన్న కొంచెం స్థలాలను కలుపుకొని



అదనపు నిర్మాణాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

ఇళ్లు నిర్మించుకున్నారని, రాజకీయ కక్షతోనే తమ ఇంటిని కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పారావు మాట్లాడుతూ తనను టీడీపీలోకి రావాలని ఒత్తిడి తెచ్చారని, పార్టీ మారకపోవడంతో తన ఇంటిని కూలగొట్టారని ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకులు, మండల నాయకులు నేరుగా హోంమంత్రి అనితకు తన ఇంటిని చూపించి ఆమె ఆదేశాలతోనే అధికారులు కూలగొట్టారని ఆరోపించారు. దీనిపై తహసీల్దారు వివరణ ఇస్తూ ఫిర్యాదు మేరకు అదనంగా ఉన్న సెంటు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సీహెచ్‌వోల వేదన.. అరణ్య రోదన

- 25 రోజులుగా నిరవధిక సమ్మె
- క్రమబద్ధీకరణ చేయాల్సిందేనని డిమాండ్
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఎన్నికల హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వం

అనకాపల్లి: చాలీచాలని వేతనాలతో ప్రజారోగ్యమే పరమావధిగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌వోలు) ఆవేదన అరణ్య రోదనగా మారింది. వీరు తమ సమస్యలు పరిష్కరించాలని 25 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి అధికారంలోకి రాగానే రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చి ఏడాదివుతున్నా నెరవేర్చడం లేదంటూ వారంతా వాపోతున్నారు.



అనకాపల్లి మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ వద్ద సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

జిల్లాలో 45 పీహెచ్‌సీ పరిధిలోని పని చేస్తున్న 425 మంది సిబ్బందిని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి 2019లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించింది. వీరిని గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సీహెచ్‌వో/ఎంఎల్‌హెచ్‌పీ)గా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నియామకాలు చేసింది. వైద్య శాఖలో అప్పటి నుంచి గ్రామీణ రోగులకు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా నేటికీ గుర్తించడం లేదు. దాంతో అరకొర వేతనాలతో తీవ్ర పని ఒత్తిడితో విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. గ్రామాల్లో 12 రకాల హెల్త్ కేర్ సేవలతోపాటు 14 రకాల వైద్య పరీక్షలు చేయడంలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ ఈ సేవలను గుర్తించి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహాల్లో పరిమితమై మంచం మీద ఉన్న రోగులకు సేవలు అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీస్‌లు పూర్తయిన సీహెచ్‌వోలను రెగ్యులర్ చేయాలి. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23% వేతన సవరణ అమలు చేయాలి. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి. ఈపీఎఫ్‌వోను పునరుద్ధరించాలి. అన్ని క్లినిక్‌ల్లో బకాయిలు చెల్లించాలి. ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలను మినహాయింపు కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. తదితర డిమాండ్లు పరిష్కరించాలని అనకాపల్లి మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



25 రోజులుగా మా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నాం. ప్రభుత్వాలు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను చిన్న చూపు చూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మేరకు క్రమబద్ధీకరణ చేయాలి.

– **రేవతి**, అనకాపల్లి

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి



గత ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న 122 కేడర్లకు 23 శాతం హైక్ ఇచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పట్ల అధికారులు పక్షపాతం చూపారు. ప్రభుత్వ అధికారులు సీహెచ్‌వోల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం బాధాకరం.

– **యమున**, యలమంచిలి మండలం

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



25 రోజులుగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లుగా లేకుండా పోయింది. భర్తీ చేసిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజేషన్ చేయాలి.

– **సంధ్య**, కశింకోట మండలం

కడుపు కోత కోయవద్దు



సీహెచ్‌వోల ఆకలి బాధలు అధికారులు పట్టించుకోవాలి. ప్రభుత్వం ముందుగా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసింది. రెండు సంవత్సరాలు విధులు నిర్వహించిన తర్వాత రెగ్యులరైజేషన్ చేస్తామని నేటికీ చేయలేదు. ప్రస్తుతం ఐదు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సేవలు అందిస్తున్నాం.

– **వరప్రసాద్**, అనకాపల్లి, మండలం

తప్పిపోయిన బాలిక.. క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



తల్లిదండ్రులకు పూజితను అప్పగించిన పోలీసులు

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని గవరపాలెంలో నాలుగేళ్ల పూజిత తప్పిపోయినట్టు తెలుసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. సంతోషిమాత ఆలయం సమీపంలో నివాసముంటున్న కాకర విజయకుమార్ హేమలతలు తమ కూతురు ఉదయం 10 గంటల సమయంలో ఇంటి వద్ద కనిపించకపోవడంతో కంగారు పడి పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పాపను వెతికి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనలో ఎటువంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని వినతి



జిల్లా సమగ్ర శిక్ష అధికారి జయప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: జిల్లా సమగ్ర శిక్షలో పోస్టులు పారదర్శకంగా భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో జిల్లా అధికారి ఆర్.జయప్రకాష్‌కు గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏర్పాటైన అనకాపల్లి జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్‌లో సెక్టోరియల్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్, ఏఎస్‌ఓ, జీసీడీవో మొదలగు పోస్టులకు తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించారన్నారు. ఇప్పుడు ఆయా పోస్టుల భర్తీకి అవకతవకలకు అవకాశం లేకుండా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ ద్వారా నియమించాలని కోరారు. ప్రతి ఖాళీ పోస్టును సమగ్ర శిక్ష గైడ్‌లైన్స్ ప్రకారం భర్తీ చేయడం వల్ల మంచి పరిణామాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, సీనియర్ నాయకులు రేబాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి అరెస్టు అన్యాయం

ఎస్పీకి బాధిత కుటుంబ సభ్యుల వినతి



ఎస్పీ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడుతున్న సైనికుడి కుటుంబ సభ్యులు

తుమ్మపాల: గ్రామదేవత పండగకు సెలవుపై వచ్చిన ఆర్మీ ఉద్యోగి కొవిరి ముత్యాలును పోలీసులు అన్యాయంగా అరెస్టు చేశారని, తక్షణమే విడుదల చేయాలని అతని భార్య అపర్ణ ఎస్పీ తుహిన్ సిన్హాకు విన్నవించుకుంది. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన ఆమెతోపాటు సైనికుడి తల్లి, కుటుంబ సభ్యులు గురువారం ఎస్పీ కార్యాలయానికి చేరుకుని తమ గోడు వినిపించుకున్నారు. ఇటీవల గ్రామదేవత పండగలో రెండు వర్గాల వారు రాత్రి సమయంలో తమ ఇంటి ముందు ఘర్షణ పడటంతో భయంతో తమ ఇంటి తలుపులు వేసుకున్నామన్నారు. ఈ క్రమంలో ఇంటి తలుపులు, కిటికీలు, సామగ్రినికి ధ్వంసం చేశారని, రక్షణ కల్పించాలని స్థానిక పోలీసులకు అనేక మార్లు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. భయభ్రాంతులతో బాత్‌రూమ్‌లో దాక్కున్నామన్నారు. తమ ఇంటి ముందు జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారని తర్వాత తెలిసిందని, ఆ కేసుకు తన భర్తను ఎటువంటి సంబంధం లేనప్పటికీ అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కొందరు కావాలనే తప్పుడు సమాచారం ఇచ్చి అరెస్టు చేయించారని, నిష్పక్షపాతంగా విచారణ చేసి విడుదల చేయాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై ఫిర్యాదు చేయండి...

టోల్ ఫ్రీ నెం.18004253365

తుమ్మపాల: గర్భిణులు వైద్యసేవల కోసం అర్హులైన వైద్యుల్ని సంప్రదించాలని, నాటు వైద్యులను, ఆర్ఎంపీలను ఆశ్రయించవద్దని డీఎంహెచ్‌వో ఎం.శాంతిప్రభ ఒక ప్రకటనలో సూచించారు. ఆర్ఎంపీలు గర్భిణులను ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ రిఫర్ చేయకూడదని, గర్భిణులు 9 నెలల కాలంలో రెండుసార్లు స్కానింగ్ చేయించుకోవచ్చునని, బిడ్డ పెరుగుదల తెలుసుకునేందుకు, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యం నిర్ధారించుకునేందుకు అర్హులైన వైద్యులను సంప్రదించి, వారి సలహా తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ పరిధిలో 18, ప్రైవేట్ పరిధిలో 60 స్కానింగ్ సెంటర్‌లు సేవలందిస్తున్నాయని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం సెక్షన్ 22 ప్రకారం, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, మేనేజ్‌మెంట్స్ సెంటర్‌కి సంబంధించి స్కానింగ్ ముందు గాని తర్వాత గాని లింగ నిర్ధారణ గురించి ఏ విధమైన ప్రచార మాధ్యమంలోనైనా ప్రకటనలు ఇస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధించబడుతుందని తెలియజేశారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు సంబంధించి ఆస్పత్రులు ఏ విధమైన అతిక్రమణలకు పాల్పడినా ప్రజలు టోల్ ఫ్రీ నెం.18004253365కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని ఆమె తెలిపారు.

అన్నదాత కష్టం నీటిపాలు



నీట మునిగి తడిసిన వరి పంటను చూపుతున్న రైతు శివ

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో రెండెకరాల వరి పొలం భారీ వర్షానికి నీట మునిగింది. దాంతో పంట మొత్తం తడిచి తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు మారిశెట్టి శివ గురువారం విలేకరుల వద్ద వాపోయాడు. వాతావరణం బాగుండటంతో మడుల్లో వరి పంట కోసి పనలుగా ఉంచామన్నాడు. ఇంతలో అకస్మాత్తుగా బుధవారం కురిసిన వర్షానికి మడుల్లో నీరు చేరి వరి పనలు తడిసిపోయి పంట పాడైందని ఆవేదన వ్యక్తం చేశాడు. పంటను అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

విశాఖలో మళ్లీ కరోనా

- పిఠాపురంకాలనీలో కలకలం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం



మహారాణిపేట: నగరంలో మళ్లీ కరోనా కలకలం మొదలైంది. చాలా కాలం తర్వాత ఓ కేసు నమోదైంది. మద్దిలపాలెంలో 28 ఏళ్ల మహిళకు కోవిడ్–19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై.. నివారణ చర్యలు చేపట్టింది. పిఠాపురం కాలనీకి చెందిన ఈ మహిళకు ఎటువంటి ప్రయాణ చరిత్ర లేదు. అయినప్పటికీ ఆమెకు కరోనా సోకడం ఆందోళన కలిగిస్తోంది. కొంతకాలంగా ఆమె జ్వరం, దగ్గు, తలనొప్పితో బాధపడుతుండటంతో.. కేజీహెచ్‌లోని మైక్రోబయాలజీ విభాగంలో పరీక్షలు చేయించుకుంది. పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా తేలడంతో.. ఆమెను నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా.. ఈ నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. కరోనా నిర్ధారణ అయిన మహిళ కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు నిర్వహించారు. గురువారం మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, కళాభారతి ప్రాంతాల్లో ప్రజలకు పరీక్షలు చేపట్టారు.

ఆరోగ్యశాఖ సూచనలివీ.. : కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ కొన్ని సూచనలు చేసింది.

- ప్రార్థనలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గించాలి.
- రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, విమానాశ్రయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, గర్భిణులు అనవసరంగా బయటకు రాకూడదు.
- క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- చేతులతో ముఖాన్ని తాకడం మానుకోవాలి.
- రద్దీగా ఉండే లేదా తక్కువ వెంటిలేషన్ ఉన్న ప్రదేశాల్లో మాస్కులు ధరించాలి.

క్లుప్తంగా

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషా రాణి

కశింకోట: చెత్తతో సంపద తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం, బయ్యవరం గ్రామ పంచాయతీల్లో గురువారం ఆమె పర్యటించి సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సక్రమంగా చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. దీనివల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరి అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం కలుగుతుందన్నారు. కేంద్రాల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.సత్యారావు, బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో ఇంటింటికీ కుళాయిలు

అనకాపల్లి: పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటి కుళాయిలను వేయడం జరుగుతుందని అక్కిరెడ్డిపాలెం సర్పంచ్ సాలాపు శాంతిసూరిఅప్పా రావు తెలిపారు. గ్రామంలో తాగునీటి కుళాయిల పైప్‌లైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏడీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మాసాల్లో ఇంటింటి కుళాయి పనులు పంచాయతీ పరిధిలో పూర్తి చేస్తామన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయలు ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. టమాటా, ఉల్లి రూ.20, బంగాళదుంప, వంకాయ, బెండకాయ, దొండకాయ, క్యాబేజీ రూ. 30, బీరకాయ, బీట్రూట్, క్యారెట్ రూ.40, చామదుంప రూ.70కు అమ్మకాలు సాగాయి.

ఛిద్రంగా కశింకోట ఆర్టీసీ బస్సు స్టేషన్



కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో బురద

కశింకోట: ఏ మాత్రం వర్షం పడినా స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఆవరణలోని గోతుల్లో నీరు నిలిచి అధ్వానంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు. బస్సులు కొన్ని లోపలకు రాకుండా బయటి నుంచే జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు గమ్యాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని వాపోతున్నారు. దీని దృష్ట్యా గతుకులు పూడ్చి తారురోడ్డుగా ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 247 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,220	4,700
రెండో రకం	3,800	4,400
మూడోరకం	3,630	3,710

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏసీఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 16 యూనిట్లు, బీ పాజిటివ్ -17, ఓ పాజిటివ్ -17, ఏబీ పాజిటివ్ -5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్లో సంప్రదించాలని కోరారు.

ఇదేందన్న.. చంద్రన్న



నాలుగు రోడ్ల జంక్షన్‌లో చంద్రన్న ప్రయాణికుల ప్రాంగణం



అస్తవ్యస్తంగా బస్సుషెల్టర్ లోపలి భాగం



నిరుపయోగంగా బస్సుల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డు

- 'చంద్రన్న ప్రయాణికుల ప్రాంగణం'లో వసతులు కరువు
- ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు



విరిగిపోయిన కిటికీ అద్దాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో 'చంద్రన్న ప్రయాణికుల ప్రాంగణం'లో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో ఇక్కడ బస్సు షెల్టర్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ షెల్టర్‌కు రోజూ న్యూ కాలనీ, వేల్పులవీధి మళ్లవీధి, చిన్నవీధి, గాంధీనగరం, విజయరామరాజు పేట వీధులు, చోడవరం, తుమ్మపాల, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే గాజువాక, విశాఖపట్నం వెళ్తుంటారు. విశాఖలో పలు కాలేజీల్లో చదువుకునే విద్యార్థులు, కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, దినసరి కార్మికులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ షెల్టర్‌లో కూర్చోడానికి వీరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. షెల్టర్‌లో బెంచీలు ఉన్నా, అపరిశుభ్రంగా ఉండటంతో మెట్ల మీదే నిల్చొని బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఫ్యాన్లు మొండి స్టాండ్‌లు వెక్కిరిస్తున్నాయి. కొన్ని ఫ్యాన్లు తిరగడం లేదు. వేసవి కావడంతో షెల్టర్‌లోకి వచ్చే ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక బస్సుల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డు పాడైపోయింది. దీంతో ఏ బస్సు ఏ సమయానికి వస్తుందో తెలియడం లేదు. విరిగిన కిటికీలు, పాన్‌పరాగ్ నమ్మిలి ఉమ్ము వేయడం, దుమ్ము, ధూళితో ఆ ప్రాంగణం అంతా బూత్ బంగ్లాను తలపిస్తోంది. తక్షణమే సంబంధిత అధికారులు బస్సు షెల్టర్‌ను బాగు చేయాలని పట్టణ ప్రయాణికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఉంది



విశాఖపట్నం వెళ్లడానికి కుటుంబంతో వచ్చాం. బస్సు కోసం నిరీక్షించేటప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నాం. కూర్చోవడానికి వీలు లేకుండా ఉంది. అసలు శుభ్రం చేస్తున్నారా.. గాలికి వదేలాసారా అనిపిస్తుంది.
– శ్రీహరి శేఖర్ మంత్రి, అనకాపల్లి

బస్సుల సమాచారం తెలియడం లేదు



వివిధ పనుల కోసం లంకెలపాలెం వెళ్లడానికి వచ్చాను. ఫ్యాన్లు తిరగడంలేదు. ఇక్కడ ఒక ఆర్టీసీ ఉద్యోగి ఉండేవారు. వారు మైక్‌లో బస్సు రాకపోకల సమాచారం చెప్పేవారు. దాంతో మాకు సౌలభ్యంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.
– సిహెచ్ రామునాయుడు, మల్లాం

తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం



అశేషంగా హాజరైన ప్రేక్షక జనం



నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో సన్నివేశం

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా నది తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో గురువారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న నాటక రంగాన్ని ప్రోత్సహించడం కోసం ఉభయ రాష్ట్రాల స్థాయిలో నాటికల ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు పెంటకోట రాము, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకుడు దాసరి బాబు, వెంకటేశ్వర దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, మండల పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామ స్వామి, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొదటిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత ప్రదర్శించారు. పీటీ మాధవ్ రచించిన నాటికలో పెళ్లి చేసి అత్తారింటికి పంపిన కుమార్తె తప్పుగా ప్రవర్తిస్తుంటే అది తప్పని తెలిసినా తల్లిగాని, తండ్రిగాని పట్టించుకోకుండా ఊరుకుంటే అది ఎక్కడికి దారి తీస్తుందో? దాని పరిణామం ఎలా ఉంటుందో? ఎంత నాశనాన్ని సృష్టిస్తుందో? చెప్పే కథాంశంతో ప్రదర్శించారు. ఇది ఆహూతులను అలరించింది. అత్యధిక సంఖ్యలో నాటిక ప్రదర్శనకు ఆహూతులు హాజరు కావడం విశేషం. ఇదిలా ఉండగా రెండో రోజు శుక్రవారం చీకటిపువ్వు, నాన్నా నేనొచ్చేస్తా, మహా ప్రస్థానం నాటికలు ప్రదర్శనకు ఏర్పాటు చేశారు.

భూ సమస్యపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్ లక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట : మా భూములను వేరే వ్యక్తులపై రీ సర్వేలో పేర్లు నమోదు చేయడంపై బాధిత రైతులు తహసీల్దార్ లక్ష్మికి గురువారం ఫిర్యాదు చేశారు. పెదమదీన శివారు ఉప్పరగూడెంకు చెందిన నక్కా సింహాచలం, కొండమ్మలు పొట్టకూటి కోసం విశాఖ పరిసర ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి వారసత్వంగా వచ్చిన పెదమదీన సర్వే నెంబర్ 400-4లో సుమారు 82 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కుటుంబ సభ్యుల ద్వారా మూడేళ్ల కిందట ఇద్దరు వ్యక్తులకు అమ్మడానికి బేరం చేసుకుని పురోణి రాసుకున్నారు. అమ్మిన వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా రీ సర్వేలో తమ పేరున ఉన్న భూమిని పురోణి రాసుకున్న వారి పేర్ల మీద ఆన్‌లైన్ చేశారని, మా భూమిని మాకు తిరిగి ఆన్‌లైన్ చేసి ఆదుకోవాలని తహసీల్దార్‌కు బాధిత రైతులు వినతి పత్రం అందించారు. దీనిపై ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు నోటీసులు అందించి విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ లక్ష్మి బాధిత రైతులకు తెలిపారు.

ఆంజనేయస్వామి సేవలో భరత్‌కుమార్



ఆశీలుమెట్ట జంక్షన్ వద్ద గణపతిని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు



అంజయ్యకాలనీలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: వాడవాడలా ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పూడిమడక రహదారి ఆశీలుమెట్ట జంక్షన్ వద్ద కుబేర శివలింగ సహిత గణపతి, కుమారస్వామి, ఆంజనేయస్వామిని, గాంధీనగరం అంజయ్యకాలనీలో స్వామివారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయి కిరణ్, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, మాజీ కౌన్సిలర్ దాడి భోగలింగేశ్వరరావు, పార్టీ నాయకులు బొడ్డేడ లక్ష్మినరసింహం, డొంక సత్తిబాబు, ఆకుల సంతోష్, బోయిన మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



మాట్లాడుతున్న సీఎం రమేష్

అనకాపల్లి టౌన్: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత దేశం సత్తా ప్రపంచ దేశాలకు తెలిసిందని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని తిరంగా యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ రింగ్‌రోడ్ జంక్షన్ నుంచి ప్రారంభమై నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కె.ఎస్.ఎన్ రాజు, సుందరపు విజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ దూత నీవే రక్ష

- ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు
- వాడవాడలా అన్నసమారాధనలు



లక్ష్మీదేవిపేట అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద కలశాలతో భక్తులు

కశింకోట: స్థానిక జాతీయ రహదారి వద్ద కూడలిలో అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తమలపాకుతో అర్చన చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కశింకోట గవరపేటలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. సాయంత్రం మహిళల భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అశోక ఫ్రెండ్ యూత్ సాంస్కృతిక కళా పరిషత్ సహకారం అందించింది. పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కుమ్మర వీధిలో పంచముఖ ఆంజనేయస్వామికి తమలపాకు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సలాది వీధి, పూసర్ల వీధి, కనకమహాలక్ష్మి వీధి, వడ్డి వీధి ప్రాంతాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని చింతలపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు మారుతి ఆధ్వర్యంలో లక్ష తమలపాకు పూజ, సహస్ర నామ అర్చన, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాత, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జన సేన మండలాధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది. తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి పూజలు నిర్వహించారు.

108 కలశాలతో పూజలు

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలం లోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మల్లిమణుగులవారి వీధి, శారదానగర్, కొత్తూరు ఆంజనేయ స్వామి ఆలయాలు, రామాలయాలలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవరపాలెం సతకంపట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులు సిందూరంతో అర్చన నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. లక్ష్మీదేవిపేట అభయాంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో 108 కలశాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కశింకోటలో హైవే కూడలి వద్ద అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అన్న సమారాధన నిర్వహణ

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.



నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైపనింగ్ కేంద్రం



మార్కెట్‌లో రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు

రైపనింగ్ కేంద్రం.. నిరుపయోగం

- రూ.25 లక్షలతో ఏర్పాటు
- సహజపద్ధతుల్లో పండ్లను మాగబెట్టే సౌకర్యాలు
- రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- రసాయనాలతోనే మామిడి, అరటి పండ్లను మాగబెడుతున్న వ్యాపారులు

నర్సీపట్నం : ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా కార్బైడ్ రహిత ఫలాలను అందజేసేందుకు ప్రభుత్వం దశాబ్దం కిందట రైపనింగ్ (మాగబెట్టు) కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. సుమారు రూ.25 లక్షల వ్యయంతో నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైపనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పండ్లు మాగబెట్టేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. చివరికి అవి నిరుపయోగంగా మారాయి. రైపనింగ్ కేంద్రం వినియోగానికి సరైన చర్యలు చేపట్టక ఎందుకు పనికి రాకుండా ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుంది. రైపనింగ్ కేంద్రం ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం రాకపోగా ప్రతి నెలా చెల్లిస్తున్న కరెంటు బిల్లు భారంగా మారింది. రైపనింగ్ కేంద్రం మరమ్మతులకు గురికావడంతో స్థానిక వ్యాపారులు రసాయనాలతో మాగబెట్టిన పండ్లను ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

పక్వానికి రాకముందే...

ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు కాయలు పక్వానికి రాకుండానే కాల్షియం కార్బైడ్‌తో మాగించి విక్రయిస్తున్నారు. మామిడితో పాటు అరటి గెలలను ఎథిలీన్ ద్వారా ఏసీలో గ్యాస్ వదిలి 3-4 రోజుల్లో మాగబెట్టడంతో పండ్లుగా మారుస్తున్నారు. మామిడి, అరటి పండ్లను వివిధ రసాయనాలతో మాగబెడుతున్నారు. రసాయనాన్ని నీళ్లలో కలిపి పండ్లపై స్ప్రే చేస్తున్నారు. అరటి గెలలను మిశ్రమంలో ముంచి పండ్లుగా మార్చుతున్నారు. ఏటా ఆ సీజన్‌కు తగ్గట్టు వీరు పండ్లను రసాయనాలతో మాగించి పెద్ద ఎత్తున అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం గాలితో పాటు అకాల వర్షాలు కురుస్తున్నాయి. మామిడి కాయలు రాలిపోతున్నాయి. వీటిని వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు గాలి, వాన కారణంగా మామిడి పండ్లు పక్వానికి రాకముందే రైతులు కాయలను కోసం మార్కెట్లో విక్రయిస్తున్నారు. 20 కిలోల బాక్సును తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. రైపనింగ్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో పండ్లను పక్వానికి తెప్పించి అమ్మకాలు చేస్తున్నారు.

బాగు చేయిస్తాం...

ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీని వివరణ కోరగా వినియోగంలో లేక చెడిపోయిందని తెలిపారు. రైపనింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కంపెనీ వారికి ఇటీవల ఫోటోలు తీసి పెట్టామని, కంపెనీ వారు వచ్చి బాగు చేయాల్సి ఉందని తెలిపారు. నెల నెలా కరెంటు బిల్లు చెల్లిస్తున్నామన్నారు.

ఉక్కు కార్మికుల సమ్మెకు మద్దతుగా నిరసన

పరవాడ: విశాఖ ఉక్కులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెనక్కి తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంటు కార్మికుల సమ్మెకు మద్దతుగా ఫార్మాసిటీ సింహాద్రి కూడలిలో గురువారం నిరసన తెలిపారు.